జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం | 1 | సెప్టెంబర్ | 2026 ◆ పేజీలు : 7



# అంచనాల కమిటి చైర్మెన్ గా బాధ్యతలు స్వీకరించిన ఎమ్మెల్యే




**ఇల్లందు, ఆగస్ట్ 31 (ప్రజా జ్యోతి)** తెలంగాణ రాష్ట్ర శాసన సభ అంచనాల కమిటీ చైర్మెన్ గా ఎమ్మెల్యే కోరం కనకయ్య సోమవారం రాష్ట్ర శాసన సభ కార్యాలయంలో భాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే కోరం కనకయ్య అధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర శాసనసభ అంచనాల కమిటీ సమావేశం అసెంబ్లీ

మిగతా 2 లో...

# శిరీషకు కన్నీటి వీడ్కోలు
## పాడె మోసిన ఎమ్మెల్యే

- కుటుంబానికి అండగా నిలిచిన జారే ఆదినారాయణ
- నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు





**ములకలపల్లి, ఆగస్టు 31 (ప్రజాజ్యోతి):** హైదరాబాద్‌లోని తుక్కుగూడ ప్రైమ్‌కేర్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తూ కుటుంబానికి ఆసరాగా నిలిచిన ములకలపల్లి మండలం చౌటిగూడెం గ్రామానికి చెందిన ఆదివాసీ యువతి ఊకే శిరీష అనూహ్యంగా మృతి చెందారు. పోస్టుమార్టం అనంతరం ఆమె మృతదేహాన్ని సోమవారం స్వగ్రామానికి తరలించగా.. అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. మృతదేహం చౌటిగూడెం చేరుకున్నప్పటి నుంచి అంతిమ సంస్కారాలు పూర్తయ్యే వరకు స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ దగ్గరుండి కార్యక్రమాలను పర్యవేక్షించారు. శిరీష భౌతికకాయాన్ని పాడెపై మోసి

మిగతా 2 లో...

# ఇక ఆన్‌లైన్ టెండర్ షురూ..!

- రూ.600 కోట్ల అర్బన్ ఛాలెంజ్ ఫండ్ ప్రాజెక్టుకు కొత్త ప్రక్రియ
- గతంలో ఆఫ్‌లైన్.. ఇప్పుడు ఈ-ప్రొక్యూర్‌మెంట్‌లో బిడ్లు
- ఆగస్టు 29న నోటిఫికేషన్.. ఆగస్టు 31 నుంచి బిడ్ల స్వీకరణ
- సెప్టెంబర్ 7 వరకు అవకాశం.. అదే రోజు బిడ్ల పరిశీలన
- దీంతోపాటు రూ.25.54 కోట్లతో మరో నోటిఫికేషన్




**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ఆగస్టు 31, ప్రజాజ్యోతి:** కొత్తగూడెం కార్పొరేషన్‌కు ప్రతిపాదించిన రూ.600 కోట్ల అర్బన్ ఛాలెంజ్ ఫండ్ ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ తయారీ ప్రక్రియ మళ్లీ మొదలైంది. గతంలో ఆఫ్‌లైన్ విధానంలో చేపట్టిన డీపీఆర్ కన్సల్టెన్సీ ఎంపికపై అభ్యంతరాలు, ఆరోపణలు రావడంతో ఆ ప్రక్రియను రద్దు చేస్తున్నట్లు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా అదే ప్రాజెక్టుకు సంబంధించి ఆగస్టు 29న కొత్త నోటిఫికేషన్ జారీ చేసి, ఈ–ప్రొక్యూర్‌మెంట్ ద్వారా కన్సల్టెన్సీ సంస్థల నుంచి బిడ్లను ఆహ్వానించారు. దీంతో గతంలో వివాదానికి దారితీసిన ఈ డీపీఆర్ ప్రక్రియ ఇప్పుడు ఆన్‌లైన్ బాట పట్టింది. ఇక రూ.600 కోట్లతో ప్రతిపాదించిన అర్బన్ ఛాలెంజ్ ఫండ్ ప్రాజెక్టులో పట్టణ మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించిన పలు పనులను చేపట్టాలని ప్రతిపాదించారు. వీటికి అవసరమైన సమగ్ర డీపీఆర్ తయారు చేసేందుకు అనుభవం ఉన్న కన్సల్టెన్సీ సంస్థను ఎంపిక చేయాల్సి ఉంది. ఈసారి ఆన్‌లైన్ విధానంలో బిడ్లు ఆహ్వానించడంతో అర్హత ఉన్న సంస్థలకు పోటీగా పాల్గొనే అవకాశం ఏర్పడింది. గతంలో డీపీఆర్ కన్సల్టెన్సీ ఎంపికకు ఆఫ్‌లైన్ విధానం అనుసరించడం, కన్సల్టెన్సీ రుసుము, ముందస్తు చెల్లింపులు, ఎంపిక ప్రక్రియ వంటి అంశాలపై ప్రశ్నలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత ప్రక్రియను రద్దు చేసి కొత్తగా ఆన్‌లైన్ టెండర్ నిర్వహిస్తామని ఎమ్మెల్యే ప్రకటించారు. తాజాగా అందుకు

మిగతా 2 లో...

- "ఎవరు చెప్పినా డోంట్ కేర్.. ఇది నా అడ్డా!"
- సొంత పార్టీ ఏఐవైఎఫ్ నాయకులనే భయపెడుతున్న సిపిఐ నేత దుర్గరాశి వెంకన్న!
- స్కూల్ భోజన నీళ్లలో బల్లి.. బయటపడ్డ నిర్లక్ష్యంపై ఏఐవైఎఫ్ ధర్నా!
- ఆందోళన చేస్తున్న నిరుద్యోగ, యువజన నాయకులపై రౌడీయిజం శైలిలో సిపిఐ నాయకుడి దౌర్జన్యం!
- "ఎమ్మెల్యే కూనంనేని చెప్పినా వినను.. షబ్బీర్ బాషా చెప్పినా డోంట్ కేర్" అంటూ వ్యాఖ్యలు!
- సొంత పార్టీ ప్రజాపోరాటాన్నే అడ్డుకోవడం వెనుక సీపీఐ వర్గాల్లో పెను దుమారం!



# లే..లే.. లెగుండి.. తమాషా చేస్తున్నారా?

2 లో..

# రీ - సర్వే ప్రక్రియ ను పకడ్బందీగా నిర్వహించాలి

- తహసీల్దార్లు _ సర్వేయర్ల సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ అంకిత్




2 లో...

## ఇక ఆన్‌లైన్ టెండర్ షురూ..!

(మొదటి పేజీ తరువాయి...)

అనుగుణంగా కొత్త నోటిఫికేషన్ వెలువడడం పై పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇక ఈ టెండర్ ప్రక్రియకు సంబంధించి ఆగస్టు 29న నోటిఫికేషన్ జారీకాగా.. ఆగస్టు 31 సాయంత్రం 4.30 గంటల నుంచి బిడ్ల స్వీకరణ ప్రారంభమైంది. సెప్టెంబర్ 7 సాయంత్రం 4.30 గంటల వరకు బిడ్లు దాఖలు చేసేందుకు అవకాశం ఇచ్చారు. అదే రోజు సాయంత్రం 4.45 గంటలకు సాంకేతిక బిడ్లను, 5 గంటలకు ఆర్థిక బిడ్లను తెరవనున్నారు. దీంతో బిడ్ల స్వీకరణకు వారం రోజుల వ్యవధి ఇచ్చినట్లు అవుతోంది.

**మరో టెండర్.. రూ.25.54 కోట్ల పనులకు**

ఇదే సమయంలో కొత్తగూడెం కార్పొరేషన్ నుంచి ఆగస్టు 29న రూ.25.54 కోట్ల అంచనా వ్యయంతో మరో టెండర్ నోటిఫికేషన్ కూడా వెలువడింది. ఇందులో అంచనా వ్యయాన్ని రూ.2,554 (25.54 కోట్లు) లక్షలుగా పేర్కొన్నారు. దీంతోపాటు నిర్దిష్ట అభివృద్ధి పనులకు సంబంధించిన ఈ టెండర్‌లో పనుల వివరాలు, బిడ్ల దాఖలు గడువు, ఇతర నిబంధనలను పేర్కొన్నారు. అయితే ఒకే రోజున కార్పొరేషన్ నుంచి రెండు టెండర్ ప్రకటనలు వెలువడటం గమనార్హం. ఈ నేపథ్యంలో గతంలో వివాదానికి దారితీసిన డీపీఆర్ ప్రక్రియను రద్దు చేసి ఇప్పుడు ఆన్‌లైన్ విధానంలో కొత్తగా బిడ్లు ఆహ్వానించడంతో.. ఈసారి ఎన్ని కన్సల్టెన్సీ సంస్థలు పోటీలో నిలుస్తాయి? ఎవరు సాంకేతిక అర్హత సాధిస్తారు? చివరకు డీపీఆర్ బాధ్యత ఎవరికి దక్కుతుంది? అన్నది ఆసక్తికరంగా మారింది. దీంతోపాటు గతంలో వచ్చిన అభ్యంతరాల నేపథ్యంలో ఈసారి ఎంపిక ప్రక్రియ ఎంత పారదర్శకంగా సాగుతుందన్నదే ఇప్పుడు కీలకంగా మారింది.

## రీ - సర్వే ప్రక్రియ ను పకడ్బందీగా నిర్వహించాలి




**కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 31, (ప్రజాజ్యోతి)** కొత్తగూడెం జిల్లాలో భూ రీ – సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. సోమవారం జిల్లాలోని ఐ.డీ.ఓ.సీ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వేణుగోపాల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ,డీ.ఆర్.ఓ పద్మావతి,సర్వే ల్యాండ్ రికార్డ్ ఎ.డి. శ్రీనివాస్ లతో కలిసి మండల తాహసిల్దార్లు, సర్వేయర్ల సమీక్షా సమావేశం లో జిల్లా కలెక్టర్ మాట్లాడారు, భూములకు సంబంధించి పాత రికార్డుల పైనే ఇప్పటికీ ఆధారపడి ఉన్నామని , ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారం కోసం భూ భారతి చట్టంను తీసుకువచ్చి రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరిగిందన్నారు ,భూ సమస్యల శాశ్వత పరిష్కారంలో భాగంగా రీ–సర్వే కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. తెలంగాణ సర్వే అండ్ బౌండరీ చట్టం ప్రకారం రీ – సర్వే నిర్వహించడం జరుగుతుందని, చట్టం గురించి అవగాహన కలిగి ఉండి, క్షేత్రస్థాయిలో అమలు చేయాలని తాహసిల్దార్లను ఆదేశించారు ఎనిమిది నియంత్రణ దశలలో ఈ సర్వే జరుగుతుందని అన్నారు, అటవీ సంబంధిత భూములను సాధారణ సర్వేయర్, రెవెన్యూ ఇన్స్పెక్టర్, జి.పి.ఓ.ల ఆధ్వర్యంలో గుర్తించాలని తెలిపారు. సర్వే బృందంతో పాటు రెవెన్యూ బృందాలు ఏర్పాటు చేసి సర్వే నిర్వహించడం, సర్వే సమయంలో ఖచ్చితంగా ఫీల్డ్ రిజిస్టర్ నిర్వహించాలని, తద్వారా క్లెయిమ్స్, అభ్యంతరాల పరిష్కరణ సులభతరం అవుతుందని తెలిపారు. గ్రామాల హద్దుల నిర్ధారణకు సంబంధించిన సమాచారం సర్పంచులు, రైతులకు అందించాలని, రీ – సర్వే ప్రక్రియలో ప్రజల సహకారం తీసుకుని పారదర్శకంగా పనులను పూర్తి చేయాలని తెలిపారు. రీ – సర్వేకు సంబంధించి ఫారాలు అందుబాటులో ఉన్నాయని, నిబంధనల ప్రకారం సక్రమంగా పూర్తి చేసి రికార్డులను సిద్ధం చేయాలని సూచించారు, జి.పి.ఓ.లు భూములకు సంబంధించిన రెవెన్యూ రికార్డులను సక్రమంగా సిద్ధం చేసి, రీ – సర్వేకు అవసరమైన సమాచారాన్ని అందుబాటులో ఉంచాలని తెలిపారు. భూముల రిజిస్ట్రేషన్ సమయంలో తహసిల్దార్ కార్యాలయాలలో సీలింగ్ డిక్లరేషన్‌ను పరిశీలించి, నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్నీ మండల తహసిల్దార్లు,సర్వేయర్లు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు, అనంతరం ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ లో సమీక్ష సమావేశం నిర్వహించి పలు సూచనలు సలహాలు అందజేశారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జడ్పీ సీ.ఈ.వో నాగలక్ష్మి,డీ.పీ.ఓ అనూష, హౌసింగ్ పీడీ సవయ్ రామ్, వివిధ మండలాల ఎంపీడీవోలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# లే..లే.. లెగుండి.. తమాషా చేస్తున్నారా?

- "ఎవరు చెప్పినా డోంట్ కేర్.. ఇది నా అడ్డా!"
- సొంత పార్టీ ఏఐవైఎఫ్ నాయకులనే భయపెడుతున్న సిపిఐ నేత దుర్గరాశి వెంకన్న!
- స్కూల్ భోజన నీళ్లలో బల్లి.. బయటపడ్డ నిర్లక్ష్యంపై ఏఐవైఎఫ్ ధర్నా!
- ఆందోళన చేస్తున్న నిరుద్యోగ, యువజన నాయకులపై రౌడీయిజం శైలిలో సిపిఐ నాయకుడి దౌర్జన్యం!
- "ఎమ్మెల్యే కూనంనేని చెప్పినా వినను.. షబ్బీర్ బాషా చెప్పినా డోంట్ కేర్" అంటూ వ్యాఖ్యలు!
- సొంత పార్టీ ప్రజాపోరాటాన్నే అడ్డుకోవడం వెనుక సీపీఐ వర్గాల్లో పెను దుమారం!

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ఆగస్ట్ 31, ప్రజాజ్యోతి :** "లే..లే.. లెగుండి.. ఇక్కడ ఏంది తమాషా చేస్తున్నారా? ఎవరు చెప్పినా డోంట్ కేర్.. ఇది నా అడ్డా! ఇక్కడ నా అనుమతి లేకుండా ఏ కార్యక్రమం చేయడానికి వీల్లేదు!" అంటూ సొంత పార్టీ అనుబంధ యువజన సంఘం నాయకులపైనే ఒక కమ్యూనిస్ట్ నాయకుడు తీవ్ర స్థాయిలో విరుచుకుపడటం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా పెను కలకలం రేపుతోంది. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న యంత్రాంగాన్ని నిలదీయాల్సిన కమ్యూనిస్టు నేతలే, స్వయంగా సొంత పార్టీ ఏఐవైఎఫ్ నాయకులను బెదిరించి ఆందోళనను విఫలం చేయాలని చూడడం సిపిఐ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

**అసలేం జరిగిందంటే..**

జిల్లా వ్యాప్తంగా నడుస్తున్న స్కూల్ బచావో కార్యక్రమంలో భాగంగా బాబు క్యాంప్ ఏరియాలోని ఒక ప్రభుత్వ పాఠశాలను ఏఐవైఎఫ్ నాయకులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ క్రమంలో మధ్యాహ్న భోజనానికి సంబంధించి ఓ దారుణమైన నిజం బయటపడింది. పాఠశాల విద్యార్థులకు వంట వండేందుకు ఉపయోగిస్తున్న నీటి పాత్రలో ఏకంగా బల్లి చనిపోయివుంది. అదే విషపూరితమైన నీటితో అన్నం వండి పిల్లలకు వడ్డించడం చూసి నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి చెందారు. ఈ విషయం బయటకు తెలిస్తే విద్యార్థుల ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుందని ఆందోళన చెంది, వెంటనే ఆ నీటితో చేసిన వంటకాన్ని బయటకు తీసుకువచ్చి పాఠశాల ఎదుట ధర్నాకు దిగారు అని ఏఐవైఎఫ్ నాయకుడు ఫహీమ్ తెలిపారు.

**"ఇది నా అడ్డా.. ఎమ్మెల్యే చెప్పినా వినను!"**

విద్యార్థుల ఆరోగ్యం, ప్రాణ భద్రత కోసం ఏఐవైఎఫ్ నాయకులు ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళన చేస్తుంటే.. అక్కడికి చేరుకున్న సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దుర్గరాశి వెంకన్న తన అనుచరులతో వచ్చి తీవ్ర స్థాయిలో రెచ్చిపోయారు. "ఇక్కడ ధర్నా చేయడానికి మీరెవరు? ఇది నా అడ్డా.. నా అనుమతి లేకుండా నా ఏరియాలో ఎలా ధర్నా చేస్తారు? ఏమైనా ఉంటే నాకే చెప్పాలి" అంటూ హుకుం జారీ చేశారు. అంతటితో ఆగకుండా తమ సొంత పార్టీ ముఖ్య నేతలను, సిపిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శాసనసభ్యులను సైతం లెక్కచేయనంటూ బరితెగించి వ్యాఖ్యానించారు. "నాకు ఎవరు చెప్పినా ఐ డోంట్ కేర్! ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చెప్పినా, సిపిఐ నేత షాబిర్ పాష చెప్పినా నేను వినను.. ఇక్కడి నుండి వెంటనే లేచిపోవాలి" అంటూ భయభ్రాంతులకు గురిచేసి ధర్నాను అడ్డుకునే ప్రయత్నం చేశారు.

**సిపిఐలో 'అడ్డా' రాజకీయమా..?**

ప్రజాసమస్యలపై పోరాడే కమ్యూనిస్ట్ పార్టీలో ఒక నాయకుడు ఇలా 'అడ్డా రాజకీయం' నడుపుతూ సొంత పార్టీ అనుబంధ ఏఐవైఎఫ్ నాయకులనే బహిరంగంగా బెదిరించడం వెనుక అసలు ఆంతర్యం ఏమిటనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. విద్యార్థుల ప్రాణాలకు ఎసరు పెట్టేలా బల్లి పడిన నీళ్లతో వంట వండిన స్కూల్ నిర్వాహకులను కాపాడటానికే వెంకన్న ఇలా ప్రవర్తించారా? సొంత పార్టీ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జిల్లా నాయకత్వాన్ని ధిక్కరిస్తూ మాట్లాడే ధైర్యం ఆయనకు ఎక్కడిది? అని పార్టీ శ్రేణులు ప్రశ్నిస్తున్నాయి.

**కఠిన చర్యలకు తీసుకోవాల్సిందే!**

విద్యార్థుల ప్రాణాల కోసం పోరాటం చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులపై దౌర్జన్యానికి దిగడమే కాకుండా, సిపిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, పార్టీ జిల్లా నాయకత్వాన్ని 'డోంట్ కేర్' అంటూ బహిరంగంగా ధిక్కరించిన దుర్గరాశి వెంకన్నపై సిపిఐ జిల్లా కమిటీ తక్షణమే క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేస్తున్నారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించి, అడ్డా కల్చర్ ప్రదర్శిస్తున్న ఇటువంటి వారిపై చర్యలు తీసుకోకపోతే కమ్యూనిస్టు పార్టీ ఆత్మగౌరవానికే పెద్ద దెబ్బ తగులుతుందని ప్రజాస్వామ్యవాదులు స్పష్టం చేస్తున్నారు.

## శిరీషకు కన్నీటి వీడ్కోలు



(మొదటి పేజీ తరువాయి...)

అంతిమయాత్రలో పాల్గొన్నారు. అనంతరం అంతిమ సంస్కారాలు దగ్గరుండి నిర్వహించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

**నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు**

శిరీష భౌతికకాయానికి , మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, దమ్మపేట మాజీ జడ్పీటీసీ పైడి వెంకటేశ్వర్లు, ములకలపల్లి మాజీ జడ్పీటీసీ బత్తుల అంజి, కారం సుధీర్, జహీర్, తాండ్ర ప్రభాకర్‌రావు, మడకం చిరుమప్ప, మడకం శ్రీను, తమ్మిశెట్టి శ్రీను, పామర్తి వెంకటేశ్వర్లు, సోయం వీరభద్రం, కట్రం స్వామి, తెల్ల చెన్నయ్య తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. స్థానిక సర్పంచ్ తానం పద్మ, జగన్నాధపురం సర్పంచ్ కుంజా వినోద్, సీతారాంపురం సర్పంచ్ కుంజా రవి, పొగళ్లపల్లి సర్పంచ్ మడకం రవి, ముత్యాలంపాడు సర్పంచ్ కల్లూరి కిషోర్‌తో పాటు పలువురు నాయకులు, ఆదివాసీ సంఘాల ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొని శిరీషకు నివాళులర్పించారు.

## అంచనాల కమిటి చైర్మెన్ గా బాధ్యతలు స్వీకరించిన ఎమ్మెల్యే

(మొదటి పేజీ తరువాయి...)

స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మండలి వైస్ చైర్మన్ బండ ప్రకాష్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన నిధుల కేటాయింపులు, వివిధ శాఖల పనితీరు, ప్రభుత్వ అంచనాలు–వ్యయాలపై సమగ్రంగా చర్చించి, ప్రజలకు మరింత మెరుగైన పాలన మరియు అభివృద్ధి ఫలాలు అందేలా తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో నిర్ణయించారు. ప్రజా అవసరాలు, రాష్ట్ర అభివృద్ధి, ప్రభుత్వ నిధుల సద్వినియోగమే లక్ష్యమని అంచనాల కమిటీ చైర్మన్ కోరం కనకయ్య తెలిపారు. ఈ సమావేశంలో అంచనాల కమిటి సభ్యులు, ఎమ్మెల్యేలు పైడి రాకేష్ రెడ్డి, సుదీర్ రెడ్డి, ఎమ్మెల్సీ యదవ రెడ్డి, శాసన సభ, శాసన మండలి ప్రధాన అధికారులు పాల్గొన్నారు.



# చినుకు పడితే చిత్తడేనా..!

- -కురుస్తున్న పంచాయతీ భవనం
- -ప్రారంభం కాకముందే బయటపడుతున్న నిర్మాణ లోపాలు
- -నాసిరకంగా మామిడి గూడెం పంచాయతీ కార్యాలయ నిర్మాణం?
- -ముందస్తు ప్రణాళికలు లేకపోవడమే కారణమా..?
- -అధికారుల పర్యవేక్షణ ఎక్కడ..?
- -ఉన్నతాధికారులు జర స్పందించరూ..
- -పంచాయతీ భవనం పనులను పర్యవేక్షించరూ..?








**ఇల్లందు, ఆగస్టు 31 (ప్రజా జ్యోతి)** ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు నిర్మిస్తున్న పంచాయతీ కార్యాలయ భవనమే చినుకు పడితే చిత్తడిగా మారితే పరిస్థితి ఎలా ఉంటుందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నిర్మాణ పనులు పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధం కాకముందే భవనంలోకి వర్షపు నీరు చేరుతున్నట్లు స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో నిర్మాణ నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**ప్రారంభం కాకముందే కురుస్తున్న వైనం**

ప్రభుత్వ నిధులతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న పంచాయతీ కార్యాలయం ప్రారంభానికి ముందే వర్షపు నీటిని తట్టుకోలేకపోతే భవనం భవిష్యత్తు ఏమిటనే ఆందోళన వ్యక్తమవుతుంది. చిన్నపాటి వర్షానికే భవనం లోపలికి నీరు చేరుతున్న పరిస్థితి ఉంటే, భారీ వర్షాల సమయంలో పరిస్థితి మరింత దారుణంగా మారే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు.

**నిర్మాణ నాణ్యతపై అనుమానాలు**

మామిడిగుండాల పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించారా లేదా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. భవన నిర్మాణంలో ఉపయోగించిన సామగ్రి, పైకప్పు పనులు, డ్రైనేజీ వ్యవస్థ, వర్షపు నీరు బయటకు వెళ్లే ఏర్పాట్లపై పూర్తిస్థాయి పరిశీలన చేయాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

**ముందస్తు ప్రణాళికలు లేకపోవడమే కారణమా..?**

పంచాయతీ భవన నిర్మాణానికి ముందే వర్షపు నీటి ప్రవాహం, భవనం చుట్టూ ఉన్న ప్రాంత పరిస్థితులు, డ్రైనేజీ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకున్నారా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ముందస్తు ప్రణాళికలో లోపాలు ఉంటే భవనం పూర్తయిన తర్వాత వాటిని సరిచేయడం మరింత భారంగా మారే అవకాశం ఉంది.

**అధికారుల పర్యవేక్షణ ఎక్కడ..?**

ప్రభుత్వ భవన నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలో సంబంధిత అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది ఎప్పటికప్పుడు పనులను పరిశీలించాల్సి ఉంటుంది. నిర్మాణ సామగ్రి నాణ్యత నుంచి ప్రతి దశలోనూ పనుల ప్రమాణాలను పరిశీలించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. అయితే భవనం ప్రారంభానికి ముందే లోపాలు బయటపడుతున్నాయంటే అధికారుల పర్యవేక్షణ ఏ స్థాయిలో జరిగిందనే ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి.

**ప్రజాధనం వృథా**

ప్రభుత్వ నిధులతో నిర్మిస్తున్న మామిడి గుండాల గ్రామ పంచాయతీ భవనంలో ప్రారంభానికి ముందే లోపాలు తలెత్తితే మరమ్మతులకు మళ్లీ ప్రజాధనాన్ని ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. నాణ్యత లేని పనుల వల్ల భవనం ఉపయోగకరంగా ఉండకపోతే ప్రభుత్వ లక్ష్యం కూడా నీరుగారే అవకాశం లేకపోలేదు. ముఖ్యంగా పంచాయతీ భవన నిర్మాణంలో జరిగిన లోపాలను గుర్తించి వెంటనే సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

**ఉన్నతాధికారులు జర చూడరూ**

మామిడిగుండాల పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణంపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. భవన నిర్మాణానికి సంబంధించిన నాణ్యతా ప్రమాణాలు, ఉపయోగించిన మెటీరియల్, పనుల అంచనాలు, అధికారుల తనిఖీల వివరాలను పరిశీలించాలని కోరుతున్నారు.

**పనులను పర్యవేక్షించరూ..?**

గ్రామ పంచాయతీ కార్యాలయ భవనం ప్రజలకు, అధికారులకు ఉపయోగపడేలా పటిష్టంగా ఉండాల్సిన అవసరం ఉంది. ప్రారంభానికి ముందే వర్షపు నీరు భవనంలోకి చేరుతున్నట్లయితే సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి లోపాలను సరిచేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. భవనం ప్రారంభించే ముందు పూర్తిస్థాయి నాణ్యతా పరిశీలన నిర్వహించి, లోపాలు లేవని నిర్ధారించిన తర్వాతే ప్రారంభించాలని వారు కోరుతున్నారు.

## చుంచుపల్లి ముస్లిం స్మశానవాటికకు అనుమతులు మంజూరు చేయాలి

- 2022 నుంచి పెండింగ్‌లో ఉన్న సమస్యను తక్షణమే పరిష్కరించాలి
- మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాకూబ్ పాషా




**కొత్తగూడెం కలెక్టరేట్ ,ఆగస్టు 31 ( ప్రజాజ్యోతి)** జిల్లాలోని చుంచుపల్లి మండలం వెంకటేశ్వర కాలనీ గ్రామ పంచాయతీ పరిధిలో ముస్లిం స్మశానవాటిక (కబరస్థాన్) ఏర్పాటుకు గుర్తించిన ప్రభుత్వ భూమికి తక్షణమే అనుమతులు మంజూరు చేసి ఉత్తర్వులు జారీ చేయాలని తెలంగాణ మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యాకూబ్ పాషా కోరారు. సోమవారం చుంచుపల్లి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు ఆయన వినతిపత్రం అందజేశారు. అనంతరం యాకూబ్ పాషా మాట్లాడుతూ వెంకటేశ్వర కాలనీ, రామాంజనేయ కాలనీ, రామ్‌నగర్, విద్యానగర్ కాలనీ ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో పేద ముస్లిం కుటుంబాలు నివసిస్తున్నాయని, వారికి ప్రత్యేకంగా స్మశానవాటిక లేకపోవడంతో మరణాలు సంభవించిన సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని యాకూబ్ పాషా తెలిపారు.ముస్లింలకు స్మశానవాటిక కోసం ప్రభుత్వ భూమి కేటాయించాలని కోరుతూ 2022 జనవరి 17న 'డయల్ యువర్ కలెక్టర్' కార్యక్రమంలో, అదే ఏడాది ఫిబ్రవరి 28న ప్రజావాణిలో వినతిపత్రాలు అందజేశామని తెలిపారు , అనంతరం కొత్తగూడెం ఆర్డీవో ఆర్‌సీ నంబర్ J/576/2022, తేదీ 30-09-2022 ద్వారా జిల్లా కలెక్టర్‌కు నివేదిక సమర్పించినట్లు తెలిపారు. చుంచుపల్లి తహసీల్దార్ నివేదిక ప్రకారం వెంకటేశ్వర కాలనీ గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 137/1లో సుమారు ఒక ఎకరం విస్తీర్ణంలో ఎలాంటి ఆక్రమణలు లేని అనువైన ప్రభుత్వ భూమిని ముస్లిం ఖనన వాటిక కోసం గుర్తించినట్లు వివరించారు. ఇందుకు సంబంధించిన స్థల మ్యాప్ కూడా అధికారులకు సమర్పించినట్లు తెలిపారు.అనువైన ప్రభుత్వ భూమిని గుర్తించి నివేదికలు సమర్పించినప్పటికీ,2022 నుంచి పలుమార్లు జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాలు అందజేసినా ఇప్పటివరకు అనుమతులు మంజూరు చేయకపోవడం బాధాకరమన్నారు. రెవెన్యూ అధికారులు ఇప్పటికే భూమిని గుర్తించి నివేదిక సమర్పించినందున ఇకపై జాప్యం చేయకుండా సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరారు. సర్వే నంబర్ 137/1లో గుర్తించిన ఒక ఎకరం ప్రభుత్వ భూమిపై నిర్ణీత కాలవ్యవధిలో చర్యలు చేపట్టి, తీసుకున్న చర్యలను తెలియజేయాలని ప్రజావాణి నోడల్ అధికారిని కోరినట్లు తెలిపారు, 2022 నుంచి పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యకు ప్రజావాణి వ్యవస్థ ద్వారా శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులు ఆరిఫ్ ఖాన్, హుస్సేన్ ఖాన్ పాల్గొన్నారు

## విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, పుస్తకాల పంపిణీ



**కొత్తగూడెం కలెక్టరేట్ ,ఆగస్టు 31 ,(ప్రజా జ్యోతి)** పాల్వంచ మండలంలోని బసవతారక కాలనీ గ్రామపంచాయతీ లో గల ప్రాథమిక పాఠశాల, ప్రీ-ప్రైమరీ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు విద్యను సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని పలువురు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బసవతారక కాలనీ సర్పంచ్ జరుపుల కాశమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భానోత్ హర్సింగ్, ఉపాధ్యాయురాలు అలివేలు మంగమ్మ, ప్రీ-ప్రైమరీ ఉపాధ్యాయురాలు కృష్ణవేణి, ఆయాలు పాల్గొని విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలను అందజేశారు.

## ఈనెల 6న ఖమ్మంలో జరిగే టి యు సి ఐ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ ను జయప్రదం చేయండి!

- టి యూ సి ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గోనెల రమేష్

**కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 31,(ప్రజా జ్యోతి)** ఈనెల 6న ఖమ్మం పట్టణంలో జరిగే టి యు సి ఐ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ ను విజయవంతం చేయాలని టి ఎస్ యు ఐ జిల్లా ఉపాధ్యక్షులు గోనెల రమేష్ పిలుపునిచ్చారు, కౌన్సిల్ సందర్భంగా సోమవారం పాల్వంచ పట్టణంలోని కె జీ బి వి హాస్టల్ లో ఉచితంగా ప్రచారం నిర్వహించారు ,ఈ సందర్భంగా గోనెల రమేష్ మాట్లాడుతూ కేజీబీవీ లో పనిచేస్తున్న కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనాలు, చట్టబద్ధహక్కులు చెల్లిస్తామని ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి మూడు సంవత్సరాలు గడుస్తున్నా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం దారుణం అన్నారు, రోజురోజుకీ పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరల కనగుణంగా కార్మికులకు వేతనాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు, బాలికల విద్యాభివృద్ధి కోసం కాలేజీలు అప్గ్రేడ్ సంతోషించ తగిన విషయమే అయినప్పటికీ అందుకు అనుగుణంగా నాన్ టీచింగ్ వర్కర్స్ ను నియమించకపోవడం వల్ల ఉన్న వర్కర్స్ మీదనే అధిక పనిభారం పడుతుందని అన్నారు, కాంట్రాక్ట్ కార్మికులతో వెట్టి చాకిరి చేపిస్తూ వేతనాలు పెంచకపోవడం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల శ్రమ దోపిడీకి నిదర్శనం అన్నారు. గత సంవత్సరం క్రితం నియమించిన వారు



పని చేస్తున్న వారందరికీ కొంత మందికి గత 18 నెలల గా పెండింగ్ ఉన్న వేతనాలు,వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 6న ఖమ్మం లోని రామ నర్సయ్య విజ్ఞాన కేంద్రంలో టి యూ సి ఐ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ నిర్వహిస్తున్నామని, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికుల జీతాలు పెంచే విధంగా ప్రభుత్వంపై పోరాటా కర్తవ్యాలను చర్చించేందుకు కాంటాక్ట్ కార్మికులు జనరల్ కౌన్సిల్ ను, జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీ యూ సి ఐ పాల్వంచ ఏరియా కమిటీ నాయకులు కుంజా భాస్కర్, కె జీ బి వి నాన్ టీచింగ్ వర్కర్స్ కుమారి, లక్ష్మి, శారద లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# పదవీ విరమణ పొందిన ఏఎస్ఐ వెంకటేశ్వర్లుకు ఘన సన్మానం

- డీఎస్పీ ఆధ్వర్యంలో వీడ్కోలు కార్యక్రమం.. శాలువాలతో సత్కరించిన వ్యాపారులు, పాత్రికేయులు



**ఆళ్ళపల్లి,ఆగస్టు 31(ప్రజా జ్యోతి )** ఆళ్ళపల్లి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా ఐదేళ్లకు పైగా సేవలందించి పదవీ విరమణ పొందిన సిహెచ్. వెంకటేశ్వర్లుకు ఆదివారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఇల్లెందు డీఎస్పీ వెంకన్న బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, వ్యాపారులు, గ్రామస్తులు, పాత్రికేయులు పాల్గొని వెంకటేశ్వర్లును శాలువాలతో సత్కరించారు. స్థానిక ఎస్సై సోమేశ్వరరావు అధ్యక్షతన జరిగిన వీడ్కోలు సమావేశంలో డీఎస్పీ వెంకన్న బాబు, వ్యాపారులు గౌరీశెట్టి శ్రీనివాస రావు, అబ్బు నాగేశ్వరరావు, నరేడ్ల వెంకన్న, బూరుగడ్డ రాములు, నరేడ్ల శ్రీనివాసరావు, నువ్వుల నరసింహారావుతో పాటు వివిధ పత్రికల విలేకరులు బోడ కుంట్ల బిక్షం, మహమ్మద్ ఫయీం, పరమ ప్రభాకర్, బూరుగడ్డ రాజు, సదానంద చారి, మహమ్మద్ ఖలీల్ తదితరులు పాల్గొని వెంకటేశ్వర్లును ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఆళ్ళపల్లి పోలీస్ స్టేషన్‌లో ఐదేళ్లకు పైగా విధులు నిర్వహించిన వెంకటేశ్వర్లు మండల పరిధిలోని అన్ని వర్గాల ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించారని కొనియాడారు. నేరాల నియంత్రణలో ప్రత్యేక పాత్ర పోషించడంతో పాటు ప్రజల సమస్యలను స్నేహపూర్వకంగా పరిష్కరించేందుకు కృషి చేశారని గుర్తుచేశారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి ప్రజల మన్ననలు పొందారని, ప్రతి కుటుంబంలో సభ్యుడిగా కలిసిపోయి మంచి పేరు సంపాదించుకున్నారని పేర్కొన్నారు.పదవీ విరమణ అనంతరం వెంకటేశ్వర్లు సుఖసంతోషాలతో, ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్తులు, వ్యాపారులు, పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

# భద్రాద్రి ఏఐవైఎఫ్ జిల్లా కమిటీలో భద్రాచలం నాయకులకు కీలక పదవులు

- యువత సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం
- నిరుద్యోగంపై సమరశంఖం పూరిస్తాం
- ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు



**కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 31,(ప్రజా జ్యోతి)** కొత్తగూడెం జిల్లా అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ జిల్లా మహాసభలో భద్రాచలం డివిజన్ నుండి జిల్లా సంయుక్త కార్యదర్శిగా సాధన పల్లి సతీష్ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అదేవిధంగా ఏవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శిగా కొక్కిరేణి అశోక్ కుమార్ , జిల్లా కౌన్సిల్ సభ్యులుగా నారు పొంగు ఏసు, పసుపులేటి సాయి క్రాంతి కుమార్ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు, ఈ సందర్భంగా సాధన పల్లి సతీష్ మాట్లాడుతూ దేశంలో ,రాష్ట్రంలో యువత సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందారన్నారు, కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం సంవత్సరానికి యువతకు రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీని నెరవేర్చలేకపోయారని , తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో నిరుద్యోగ సమస్య లేకుండా చేస్తామని , ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, మాయమాటలు చెప్పి ఇప్పటివరకు యువతకు ఎటువంటి ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కులాల మధ్య మతాల మధ్య చిచ్చుపెట్టి యువత నిరుద్యోగ సమస్యల పై నేటి వరకు ఎలాంటి సమాధానం ఇవ్వకపోవడం విచారకరమన్నారు. అదేవిధంగా ఇటీవల కాలంలో జంజి బుద్దింకల యువత ఉద్యమం కేంద్రాన్ని కుదిపేసిందని , దీంతో విద్యార్థులు దేశంలో అనేకమంది చనిపోయారని దీనికి కారణమైన కేంద్రమంత్రి రాజీనామా చేసేంతవరకు యువత విద్యార్థులు ఐక్యంగా ఢిల్లీ నడిబొడ్డున పెద్ద ఎత్తున దీక్షలు చేపట్టి ఉద్యమించడం వల్ల కేంద్ర మంత్రి రాజీనామా చేయడం ఈ దేశంలో యువత విద్యార్థులు తలుచుకుంటే ఏదైనా సాధించగలరని నిరూపించారని అన్నారు. భవిష్యత్తులో ఏఐవైఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నిరుద్యోగ సమస్య పైన ,యువత సమస్య పైన పెద్ద ఎత్తున ఉద్యమాలు పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు,

# పినపాక ప్రజావాణిలో 9 దరఖాస్తుల స్వీకరణ



**పినపాక,ఆగస్టు 31(ప్రజాజ్యోతి)** పినపాక మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సంకీర్త్, తహసీల్దార్ శ్రీనివాసరెడ్డితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ప్రజల నుంచి మొత్తం తొమ్మిది దరఖాస్తులు స్వీకరించి రసీదులు అందజేశారు. రెవెన్యూ శాఖకు నాలుగు, పంచాయతీరాజ్ శాఖకు మూడు, గృహ నిర్మాణ శాఖకు ఒకటి, విద్యుత్ శాఖకు ఒక దరఖాస్తు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రతి సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# 15వ ఆర్థిక నిధులు జమ చేయాలి

- ఎంపీడీవో కి వినతి పత్రం అందజేత



**చర్ల, ఆగస్టు 31:(ప్రజా జ్యోతి):** 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలైనట్లు ప్రభుత్వం ప్రకటిస్తున్నప్పటికీ కొన్ని గ్రామ పంచాయతీల ఖాతాల్లో నిధులు జమ కాలేదని చర్ల మండల సర్పంచుల అధ్యక్షుల సంఘం ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో చర్ల మండల పరిషత్ అభివృద్ధి అధికారికి వినతిపత్రం అందజేశారు.గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి, పారిశుధ్యం తదితర కార్యక్రమాలను నిర్వహించేందుకు సర్పంచులు తమ సొంత డబ్బులను ఖర్చు చేయాల్సి వస్తోందని తెలిపారు. పంచాయతీలకు రావాల్సిన నిధులు సకాలంలో జమ కాకపోవడంతో సర్పంచులపై ఆర్థిక భారం పడుతోందని అన్నారు . ఇప్పటికే సొంత నిధులు ఖర్చు చేసి అప్పులపాలయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు.కావున పెండింగ్‌లో ఉన్న 15వ ఆర్థిక సంఘం నిధులను ఆయా గ్రామ పంచాయతీ ఖాతాల్లో వెంటనే జమ చేసేలా సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు చేపట్టాలని వారు అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షురాలు సోయం నాగలక్ష్మి , ఉపాధ్యక్షుడు జె. మురళీకృష్ణ, ఎస్ . తిరుపతిరావు, సర్పంచులు టి . రవికుమార్, కె. కమల, బి. సుహాసిని, చర్ల సర్పంచ్ పూజారి సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సమస్యలు పరిష్కరించండి

- తహసిల్దార్ శ్రీనివాస్ కు వినతి పత్రం అందజేత

**చర్ల, ఆగస్టు 31 (ప్రజా జ్యోతి):** చర్ల మండల ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం చర్ల మండల రెవెన్యూ అధికారికి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ చర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్మిస్తున్న నూతన భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక అంబులెన్స్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడంతో పాటు అర్హత ఉన్న వారికి కొత్త పింఛన్లు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. చర్ల బస్టాండ్ నుంచి సాయిబాబా ప్రాంతం వరకు డ్రైనేజీ పనులు చేపట్టి రహదారిని పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలని కోరారు. డ్రైనేజీ, రహదారి సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజల సమస్యలను అధికారులు సానుకూలంగా పరిశీలించి, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని త్వరితగతిన పరిష్కరించాలని నాయకులు కోరారు.ఈ కార్యక్రమంలో



సీపీఎం చర్ల మండల కార్యదర్శి మచ్చా రామారావు, మండల కమిటీ సభ్యులు పొదుపుగంటి సమ్మక్క, బందెల చంటి, నవీన్, వరదల వరలక్ష్మి, రైతు సంఘం చర్ల మండల కార్యదర్శి ఎన్. మూర్తి, శ్యామల, కాంతయ్య, రైతు సంఘం అధ్యక్షులు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణాపై అటవీశాఖ ఉక్కుపాదం



**దమ్మపేట, ఆగస్టు 31(ప్రజాజ్యోతి):** దమ్మపేట అటవీ రేంజ్ లో తిరుమల కుంట వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పాల్వంచ అటవీ డివిజన్ పరిధిలోని దమ్మపేట అటవీ రేంజ్‌లో అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు నిర్వహిస్తున్న తనిఖీల్లో భాగంగా ఆదివారం రాత్రి సుమారు 1.30 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పాకలగూడెం నుంచి తిరుమలకుంట వైపు ఇసుక లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను తిరుమలకుంట వద్ద రాత్రి గస్తీలో ఉన్న అటవీశాఖ సిబ్బంది తనిఖీ చేశారు. ఇసుక రవాణాకు సంబంధించి చెల్లుబాటయ్యే అనుమతులు, పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్‌ను ఇసుక లోడుతో సహా స్వాధీనం చేసుకుని అటవీశాఖ ఆధీనంలో ఉంచారు. ఘటనపై సంబంధిత చట్ట నిబంధనల ప్రకారం కేసు నమోదు చేసి తదుపరి విచారణ, చట్టపరమైన చర్యలు చేపడుతున్నట్లు దమ్మపేట ఫారెస్ట్ రేంజ్ అధికారి కె. శ్రీను తెలిపారు. అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు చెక్‌పోస్టుల వద్ద వాహన తనిఖీలతో పాటు అనుమానాస్పద ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా, తనిఖీలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

# వ్యవసాయ విద్యుత్ వైర్లతో రైతులు అప్రమత్తంగా ఉండాలి: ఏఈ వేణుగోపాల్



**పినపాక,ఆగస్టు 31(ప్రజాజ్యోతి)** రైతులు వ్యవసాయ మోటార్లకు సంబంధించిన విద్యుత్ వైర్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని పినపాక వేణుగోపాల్ సూచించారు. సోమవారం పినపాక మండలం ఈ బయ్యారం విద్యుత్ ఉపకేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. పొలాల్లో వ్యవసాయ మోటార్లకు విద్యుత్ సరఫరా చేసే వైర్లను పొలాల గట్లపై వేలాడదీయడం, నిర్లక్ష్యంగా పడవేయడం చేయవద్దని తెలిపారు. విద్యుత్ వైర్లు కిందికి వేలాడటం లేదా పొలాల్లో పడివుండటం వల్ల రైతులు, కూలీలు, పశువులకు ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా వ్యవసాయ పనులు చేసే సమయంలో విద్యుత్ వైర్లను తాకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వైర్లలో ఏమైనా లోపాలు, తెగిపోయిన తీగలు కనిపిస్తే వాటిని తాకకుండా వెంటనే విద్యుత్ శాఖ సిబ్బందికి సమాచారం అందించాలని తెలిపారు. విద్యుత్ పరికరాల విషయంలో నిర్లక్ష్యం చేయకుండా భద్రతా చర్యలు పాటించాలని రైతులకు సూచించారు. అలాగే కొంతమంది అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని తెలియజేశారు. అక్రమంగా విద్యుత్ వాడడం నేరమని వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అర్హత గల రైతులు నూతన కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

# నక్సలైట్ ల డంప్ గుర్తింపు

- **భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలు, ఇతర సామగ్రిని స్వాధీనం**



**చర్ల , ఆగస్టు 31:(ప్రజాజ్యోతి):** ఛత్తీస్‌గఢ్‌లో కొనసాగుతున్న నక్సల్ వ్యతిరేక ఆపరేషన్‌లో భద్రతా దళాలు మరో కీలక విజయాన్ని సాధించాయి. గంగలూరు పోలీస్ స్టేషన్, సీఆర్‌ప ీఎఫ్ 85వ బెటాలియన్‌కు చెందిన సంయుక్త బృందం ముత్వేండి అటవీ ప్రాంతంలో దాచిపెట్టిన నక్సలైట్ డంప్‌ను గుర్తించి భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలు, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకుంది. నక్సల్ వ్యతిరేక ఆపరేషన్‌లో భాగంగా ముత్వేండి అటవీ ప్రాంతంతో పాటు పరిసర సున్నిత ప్రాంతాల్లో భద్రతా దళాలు విస్తృతంగా గాలింపు చేపట్టాయి. అనుమానాస్పద కార్యకలాపాలపై సమాచారం అందడంతో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించగా అడవిలో నక్సలైట్లు దాచిన డంప్‌ను గుర్తించారు. డంప్‌లో రెండు ఆయుధాలు, బీజీఎల్ షెల్స్, కార్డెక్స్ వైర్, బాణం బాంబులు, డిటోనేటర్లు, ఇతర పేలుడు పదార్థాలతో పాటు 7.62 ఎంఎం ఎస్ఎల్ఆర్‌కు చెందిన 30 సజీవ తూటాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న పేలుడు పదార్థాలు, ఆయుధాలను భద్రతా ప్రమాణాల ప్రకారం సురక్షితంగా సీజ్ చేసి గంగలూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఘటనపై తదుపరి చట్టపరమైన చర్యలు కొనసాగుతున్నాయి.ముత్వేండి ప్రాంతంలో డంప్‌ను గుర్తించడం నక్సల్ వ్యతిరేక ఆపరేషన్‌లో కీలక విజయమని భద్రతా వర్గాలు పేర్కొన్నాయి. బీజాపూర్ జిల్లాలోని నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో ఆయుధాలు, పేలుడు పదార్థాల నిల్వలను గుర్తించేందుకు భద్రతా దళాలు నిరంతరం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి అని అధికారులు అన్నారు.

# ఇరవెండిలో వీబీజీ-రామ్‌జీ గ్రామసభ

- **- ఉపాధి హామీ పనుల గుర్తింపునకు ఏకగ్రీవ తీర్మానాలు**




**బూర్గంపహాడ్, ఆగస్టు 31 (ప్రజాజ్యోతి):** మండలంలోని ఇరవెండి గ్రామపంచాయతీలో వికసిత్ భారత్– గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (వీబీజీ–రామ్‌జీ) పథకం కింద ఉపాధి హామీ పనుల గుర్తింపునకు సోమవారం గ్రామసభ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ గుండి బాబురావు అధ్యక్షతన నిర్వహించిన ఈ గ్రామసభలో గ్రామాభివృద్ధి, ఉపాధి కల్పన, సహజ వనరుల సంరక్షణకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను పెంచే ఉద్దేశంతో చేపట్టాల్సిన పనులపై ప్రజలకు అవగాహన కల్పించారు.పథకం ద్వారా 125రోజుల పని హామీ, కనీస వేతనం రూ.300, నీటి సంరక్షణ, గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి వంటి అంశాలను అధికారులు వివరించారు. అర్హులైన కూలీలు ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.గ్రామానికి అత్యవసరంగా అవసరమైన అభివృద్ధి పనులను గ్రామసభలో ప్రజల అభిప్రాయాల మేరకు గుర్తించారు. ముఖ్యంగా చెరువుల పూడికతీత, కుంటల నిర్మాణం, నీటి సంరక్షణకు సంబంధించిన పనులతో పాటు సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాల్సిన అవసరాన్ని గ్రామస్థులు ప్రస్తావించారు. ఆయా పనులను ఉపాధి హామీ పథకం లేబర్ బడ్జెట్‌లో చేర్చేందుకు గ్రామసభ ఏకగ్రీవంగా తీర్మానించింది.గ్రామంలో నీటి వనరులను అభివృద్ధి చేయడం ద్వారా సాగు, తాగునీటి అవసరాలకు ఉపయోగపడేలా చర్యలు చేపట్టాలని, అదే సమయంలో స్థానిక కూలీలకు ఉపాధి కల్పించే పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని సభలో నిర్ణయించారు. గ్రామ అవసరాలకు అనుగుణంగా పనులను ఎంపిక చేసి దశలవారీగా అమలు చేయాలని గ్రామస్థులు కోరారు.కార్యక్రమంలో ఏపీఓ విజయలక్ష్మి , ఉపసర్పంచ్ మహంకాళి రామారావు, పాలకవర్గ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి స్పందన, టీఏ, ఫీల్డ్ అసిస్టెంట్, స్వయం సహాయక సంఘాల మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## బెల్ట్ షాపులకు అడ్డుకట్ట వేయాలి

- **ఇండ్ల మధ్య.. బడులు, గుడుల సమీపంలో అనధికార మద్యం విక్రయాలు నిలిపివేయాలి**
- **ఎక్సైజ్ అధికారులకు దమ్మపేట వార్డు సభ్యుల వినతి**




**దమ్మపేట, ఆగస్టు 31(ప్రజాజ్యోతి):** దమ్మపేట గ్రామపంచాయతీ పరిధిలో ఇండ్ల మధ్య, పాఠశాలలు, దేవాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల సమీపంలో నిర్వహిస్తున్న బెల్ట్ షాపులు, అనధికార మద్యం దుకాణాలపై చర్యలు తీసుకోవాలని వార్డు సభ్యులు కోరారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డేలో ఎక్సైజ్ శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నివాస ప్రాంతాల్లో బెల్ట్ షాపుల కారణంగా మహిళలు, బాలికలు, యువతపై తీవ్ర దుష్ప్రభావం పడుతోందన్నారు. మద్యం సులభంగా లభిస్తుండటంతో కుటుంబాల్లో ఆర్థిక ఇబ్బందులు, గొడవలు పెరుగుతున్నాయని తెలిపారు. మద్యం మత్తులో భార్యా పిల్లలను వేధించడం, చిన్నచిన్న విషయాలకే గొడవలకు దిగడం వంటి ఘటనలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. పాఠశాలల సమీపంలో మద్యం విక్రయాలు జరగడం వల్ల విద్యార్థులపై ప్రతికూల ప్రభావం పడుతోందన్నారు. తాగుబోతుల అసభ్య ప్రవర్తనతో విద్యార్థులు, ముఖ్యంగా బాలికలు భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. దేవాలయాల వద్ద మద్యం సేవించి పడుకోవడం, భక్తులకు ఇబ్బందులు కలిగించడం జరుగుతోందన్నారు. బెల్ట్ షాపుల వద్ద రోడ్లపై ఖాళీ మద్యం సీసాలు పడేయడం, ఇళ్ల వద్ద మూత్ర విసర్జన, ఉమ్మివేయడం వంటి సమస్యలపై ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. అర్ధరాత్రి వేళల్లోనూ మద్యం కోసం బెల్ట్ షాపుల వద్దకు వచ్చి గేట్లు కొట్టడంతో చుట్టుపక్కల ఇళ్ల వారు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మద్యం షాపుల పని వేళలు ముగిసిన తర్వాత కూడా బెల్ట్ షాపుల ద్వారా మద్యం అందుబాటులోకి వస్తోందని, దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. దమ్మపేట గ్రామపంచాయతీ పరిధిలోని నల్లకుంట గ్రామంలో బెల్ట్ షాపులు నిర్వహించకూడదని ప్రజలు తీసుకున్న నిర్ణయం అభినందనీయమని అన్నారు. నివాస ప్రాంతాలకు దూరంగా అనధికార మద్యం విక్రయాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ అధికారులను కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో పానుగంటి లక్ష్మణ్ గౌడ్, దారా రాము, రూపా రాంబాబు, బత్తుల సాయి ఉన్నారు.

## ఆదివాసీ యువతి మృతిపై దర్యాప్తు చేయాలి

- **ఇరప. రాజు దొర డిమాండ్**



**చర్ల, ఆగస్టు 31:(ప్రజాజ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ఆదివాసీ యువతి తుక్కుగూడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సుగా విధులు నిర్వహిస్తూ అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందిన ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టి, ఆమె మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ ఇరప. రాజు దొర డిమాండ్ చేశారు. ఆదివాసీ యువతులు ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడు వారి భద్రతపై ప్రభుత్వం, ప్రైవేట్ సంస్థల యాజమాన్యాలు ప్రత్యేక బాధ్యత వహించాలని ఆయన అన్నారు. యువతిపై అఘాయిత్యానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై వెంటనే కేసు నమోదు చేసి, అన్ని కోణాల్లో దర్యాప్తు చేయాలని కోరారు. యువతి మృతికి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా కారణమైన వారందరినీ చట్టపరంగా బాధ్యులను చేసి, చట్టం అనుమతించే అత్యంత కఠినమైన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణ ఆర్థిక సహాయం అందించడంతో పాటు, అర్హత ఉన్న కుటుంబ సభ్యుడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. కుటుంబానికి పూర్తి న్యాయ సహాయం అందించి, కేసు దర్యాప్తును పారదర్శకంగా నిర్వహించాలని అన్నారు. ఆదివాసీ యువతుల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టి, ప్రైవేట్ ఆసుపత్రులు, సంస్థల్లో పనిచేసే మహిళలకు సురక్షితమైన పని వాతావరణం కల్పించేలా అధికారులు పర్యవేక్షణ పెంచాలని వేదిక డిమాండ్ చేసింది. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని అవసరమైతే ప్రజాస్వామ్య పద్ధతిలో ఆందోళనలు చేపడతామని ఆదివాసీ యువ నాయకులు పాయల. కన్నారావు, నూపా. కృష్ణ, కుంజా. చంటి, శివ, ఆదివాసీ మహిళా జేఏసీ నాయకురాలు బీరబోయిన. రాణి, ఇరప. అపర్ణ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేపై ఆరోపణలు అవాస్తవం

- **ఖండించిన చర్ల కాంగ్రెస్ ఎస్సీ సెల్**




**చర్ల, ఆగస్టు 31:(ప్రజా జ్యోతి):** భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావుపై బీఆర్ఎస్ నాయకులు చేసిన నిరాధార ఆరోపణలను చర్ల మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మచ్చ రాజా ఆధ్వర్యంలో సోమవారం ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, పేదలు, అణగారిన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. రాజకీయ లబ్ధి కోసం ఆధారాలు లేని ఆరోపణలు చేయడం సరికాదని, ఆరోపణలు చేసే ముందు వాటికి సంబంధించిన ఆధారాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు.ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యేపై వ్యక్తిగత విమర్శలు, నిరాధార ఆరోపణలు చేస్తే కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ తరఫున తగిన స్థాయిలో సమాధానం ఇస్తామని స్పష్టం చేశారు. అభివృద్ధే తమ లక్ష్యమని, ప్రజా సేవే తమ ధ్యేయమని అన్నారు .ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ కోడిరెక్కల నాగరాజు, ఎస్సీ సెల్ సెక్రటరీ బట్ట బాలకృష్ణ, జనరల్ సెక్రటరీ కొడిరెక్కల వెంకట్ , టౌన్ ప్రెసిడెంట్ వందే నరసింహమూర్తి, జనరల్ సెక్రటరీ కొప్పుల సందీప్, చల్ల పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## క్రాంతిపురంలో ఆరోగ్య శిబిరం





**చర్ల, ఆగస్టు 31:(ప్రజాజ్యోతి ):** చర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హారిక ఆధ్వర్యంలో క్రాంతిపురం గ్రామంలో సోమవారం ఆరోగ్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న 36 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన చికిత్సతో పాటు మందులు అందించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జ్వరం, ఇతర అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని, నాటు వైద్యాన్ని ఆశ్రయించకుండా వైద్యుల సలహా తీసుకోవాలని సూచించారు.అనంతరం సాయంత్రం వనవాసి (కొమరం భీం )హాస్టల్‌లో ఆరోగ్య శిబిరం నిర్వహించి 32 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన విద్యార్థులకు చికిత్స, మందులు అందించారు.ఈ సందర్భంగా డాక్టర్ హారిక మాట్లాడుతూ బయట లభించే జంక్‌ఫుడ్‌ను అధికంగా తీసుకోవడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. విద్యార్థులు తాజా కూరగాయలు, పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. చేతులు సబ్బుతో శుభ్రంగా కడుక్కోవడం, వ్యక్తిగత పరిశుభ్రత, శరీర పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రాంప్రసాద్, ల్యాబ్ టెక్నీషియన్ గోపి, హెల్త్ అసిస్టెంట్ ధర్మారావు, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ తులసి, ఆశా కార్యకర్త ఉషారాణి పాల్గొన్నారు.

## కొయ్యూరులో కొవ్వొత్తులతో నిరసన

- ఉయిక శిరీషకు న్యాయం చేయాలని డిమాండ్



**చర్ల, ఆగస్టు 31:(ప్రజాజ్యోతి):** హైదరాబాద్‌లో అత్యాచారానికి గురై మృతి చెందిన ఆదివాసీ యువతి ఉయిక శిరీషకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ చర్ల మండలం కొయ్యూరులో సోమవారం యువత, మహిళా సంఘాలు, గ్రామ పెద్దలు సోమవారం కొవ్వొత్తుల నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా ప్రధాన రహదారిపై కొవ్వొత్తులు వెలిగించి శిరీషకు నివాళులర్పించారు. ఘటనకు బాధ్యులైన వారిపై ప్రభుత్వం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని, నిందితుడు సైనావుల్లాపై చట్టపరమైన చర్యలు చేపట్టి కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని, మహిళలకు భద్రత కల్పించడంలో అధికారులు కఠినంగా వ్యవహరించాలని కోరారు. శిరీష కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కొయ్యూరు యువత డిమాండ్ చేసింది.ఈ నిరసనలో కోరం భిక్షపతి, పూనెం రవి, ఇర్ప అరుణ్, కోరం వేణు, గొటే అరుణ్, ఇర్ప రాజు, సపక అశోక్, ఇర్ప శరత్, కోరం నవీన్, ఇర్ప శ్రీను, ఇర్ప సుమంత్, మడిపల్లి రవి, మడిపల్లి సాంబశివ, ఇర్ప అభిరామ్, కోరం బన్నీ, కొట్టేం రెడ్డి, ఇర్ప యోగి, ఇర్ప రవీంద్ర, కాక ఆర్య, బందా సోనూ, సరేం హర్దీప్, సరేం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

# అయ్యో... ఎమ్మెల్యే కి ఏమీ తెలియదంట..!

- ఇసుక ర్యాంపులు, ఉద్యోగాలు, బదిలీలకై వసూళ్ల గురించి తెలియదా..?
- మీ పక్కనే ఉంటూ వసూళ్లకు పాల్పడుతున్నా తెలియదనడం సమంజసమేనా..?
- భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావ్‌ను బర్తరఫ్ చేయాలి
- పీఏ కళ్యాణ్ వసూళ్ల వెనుక ఉన్న వారిని వెలికితీయాలి
- ఎమ్మెల్యే పీఏ బ్యాంకు లావాదేవీలను వెలుగు తీసి
- అసలు నేరస్తులను అరెస్టు చేసి బాధితులకు న్యాయం చేయాలి
- బంజారా సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా చైర్మన్ బానోత్ వీరు నాయక్



**కొత్తగూడెం కలెక్టరేట్ ,ఆగస్టు 31, (ప్రజా జ్యోతి)** అమాయక ప్రజల నుంచి ఉద్యోగాలు, బదిలీల పేరుతో డబ్బులు వసూలు చేసిన భద్రాచలం నియోజకవర్గ శాసన సభ్యులు తెల్లం వెంకట్రావు పీఏ కొర్ల కళ్యాణ్ కుమార్ వెనుక ఉన్న వారిని వెలికి తీయాలని, అసలు నేరస్తులను అరెస్టు చేసి బాధితులకు న్యాయం చేయాలని బంజారా సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చైర్మన్ బానోత్ వీరు నాయక్ డిమాండ్ చేశారు. ఇంత జరుగుతున్నా ఎమ్మెల్యే కి మాత్రం ఏమీ తెలియదనడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. సోమవారం లక్ష్మీదేవిపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శాసన సభ్యుడి వద్ద పీఏగా పనిచేస్తూ ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ వందలాది మంది వద్ద నుంచి కోట్ల రూపాయలు వసూలు చేసి మోసగించాడని, ఇది ఏమాత్రం సహించరానిదన్నారు. అమాయక నిరుద్యోగులు అతని మాటలు నమ్మి లక్షల రూపాయలు అప్పుగా తీసుకువచ్చి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే దగ్గర పనిచేసే పీఏ.. ఎమ్మెల్యేకు తెలియకుండానే కోట్ల రూపాయలు వసూళ్లకు పాల్పడ్డాడంటే నమ్మశక్యంగా లేదని, దీని వెనుక ఎమ్మెల్యే హస్తం కూడా ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. జెన్కో, ట్రాన్స్‌కో, ఐటీసీ వంటి పలు ప్రభుత్వ కంపెనీల్లో పర్మనెంట్ పోస్టుల పేరుతో నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్లను సృష్టించి ఇవ్వడం వెనుక ఎవరెవరున్నారనే విషయాలపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంస్థల్లో పనిచేసే ఉద్యోగుల బదిలీలు స్థానిక ఎమ్మెల్యే రికమండేషన్ లేకుండా చేసే అవకాశం లేదని, కాబట్టి దీని వెనుక ఎమ్మెల్యే కూడా ఉన్నారని స్పష్టంగా తెలుస్తోందన్నారు. పీఏతోపాటు ఎమ్మెల్యే, ఆయన బంధువుల బ్యాంకు ఖాతాల లావాదేవీలను పరిశీలించాలని, అవసరమైతే సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని కోరారు. ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రతినిధి ప్రజలకు మేలు చేయాల్సిందిపోయి పీఏను అడ్డుపెట్టుకుని వసూళ్లు చేశారని, అటువంటి ఎమ్మెల్యేను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. గతంలోనూ గోదావరి ఇసుక ర్యాంప్‌ల విషయంలో ఖమ్మం, నల్గొండ జిల్లాలకు చెందిన పలువురు కాంట్రాక్టర్లు ఎమ్మెల్యేను ఆశ్రయించగా, వారి అవసరాన్ని ఆసరా చేసుకుని వారి వద్ద నుంచి కోట్లల్లో వసూలు చేసినట్లుగా ఆరోపణలు సైతం ఉన్నాయన్నారు. ఎమ్మెల్యే వెంకట్రావు తనకు ఏమీ తెలియనట్లుగా వ్యవహరించడం సమంజసమేనా అని ప్రశ్నించారు. పీఏ కళ్యాణ్ కుమార్ పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు సోషల్ మీడియాలో వస్తుందని, దీని వెనుక ఉన్న నేరస్తులను అదుపులోకి తీసుకొని బాధితులు కొన్ని న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు ఈ విలేకరుల సమావేశంలో జేఏసీ జిల్లా నాయకులు బానోత్ రమేష్.. గుగులోత్ భద్రు. జాటోత్ భరత్. ధరావత్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

## పాండురంగాపురం తండా సమస్యల పరిష్కారానికి ఎంపీడీఓకు వినతిపత్రం




**పాల్వంచ, ఆగస్టు 31, ప్రజాజ్యోతి:** పాండురంగాపురం తండా గ్రామపంచాయతీలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించడంతో పాటు అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరుతూ గ్రామపంచాయతీ ప్రతినిధులు ఎంపీడీఓకు వినతిపత్రం సమర్పించారు. పాల్వంచ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో గ్రామపంచాయతీ ప్రతినిధులు ఎంపీడీఓను కలిసి గ్రామ సమస్యలను వివరించారు. గ్రామానికి కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని, పెండింగ్‌లో ఉన్న గ్రామపంచాయతీ బిల్లులతో పాటు అంగన్‌వాడీ భవన నిర్మాణానికి సంబంధించిన బిల్లులను వెంటనే మంజూరు చేసి విడుదల చేయాలని కోరారు. అలాగే గ్రామ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేసి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాండురంగాపురం తండ సర్పంచ్ ఉప్మా, ఉపసర్పంచ్ మార్గ అంకయ్యతో పాటు గ్రామపంచాయతీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## దమ్మపేటలో విబి-జి-రామ్-జి పనులపై సమావేశం

- ఉపాధి పనులకు రూ.10 కోట్ల ప్రణాళిక
- నీటి సంరక్షణకు ప్రాధాన్యం..
- 125 రోజులకు పని దినాల పెంపు



**దమ్మపేట, ఆగస్టు 31(ప్రజాజ్యోతి):** దమ్మపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు అధ్యక్షతన విబి–జి–రామ్–జి పనులపై సమావేశం నిర్వహించారు. టెక్నికల్ అసిస్టెంట్ కే. బాలస్వామి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో గ్రామంలో ఉపాధి హామీ పనులు, జాబ్ కార్డులు, రానున్న పనుల ప్రణాళికపై చర్చించారు.దమ్మపేట గ్రామపంచాయతీ పరిధిలో మొత్తం 1,876 జాబ్ కార్డులు ఉండగా, 1,218 కార్డులు యాక్టివ్‌గా ఉన్నాయని, 574 మంది పనులు చేస్తున్నారని బాలస్వామి తెలిపారు. జూలై 1 నుంచి ఇప్పటివరకు 87 మంది మాత్రమే పనులు చేసినట్లు చెప్పారు. జాబ్ కార్డుల ఆధారంగా పంచాయతీకి ఏడాదికి రూ.3 కోట్లకు పైగా బడ్జెట్ వచ్చే అవకాశం ఉందన్నారు. గ్రామసభ తీర్మానం ద్వారా ప్రతిపాదనలు పంపి 365 రకాల పనులు చేపట్టవచ్చని వివరించారు. ఉపాధి హామీ పథకంలో పని దినాలను 100 నుంచి 125 రోజులకు పెంచినట్లు తెలిపారు. రోజుకు రూ.308 కూలీ లభిస్తుందని, ఒక్క జాబ్ కార్డు హోల్డర్‌కు రూ.2 లక్షల వరకు పనులు చేసుకునే అవకాశం ఉందన్నారు. కొత్త జాబ్ కార్డు కోసం 18 ఏళ్లు నిండి ఉండి, బ్యాంకు ఖాతా, రేషన్ కార్డు కలిగి, శారీరక శ్రమ చేయగలిగిన వారు అర్హులని చెప్పారు. రానున్న మూడేళ్లకు రూ.10 కోట్లతో ప్రణాళిక రూపొందించి, అందులో రూ.4 కోట్లు మెటీరియల్‌కు, రూ.6 కోట్లు కూలీలకు వినియోగించేలా పనులను ఎంపిక చేసుకోవాలని బాలస్వామి సూచించారు. దమ్మపేట మండలంలో భూగర్భ జలమట్టం తక్కువగా ఉన్నందున వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచే పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు సూచించారు. గ్రామానికి ఉపయోగపడే కమ్యూనిటీ పనులతో పాటు అర్హులైన సన్నకారు రైతులకు వ్యవసాయ చెరువుల నిర్మాణానికి అవకాశం ఉందన్నారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి బండి అనంత్‌కుమార్, వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్‌గౌడ్, దారా రాము, రూపా రాంబాబు, బత్తుల సాయి, చిన్నశెట్టి నాగలక్ష్మి, గ్రామస్తులు రొయ్యల కుమార్, చిన్నశెట్టి మధు తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసి బిడ్డ శిరీషకు న్యాయం చేయాలని అన్నపురెడ్డిపల్లిలో నిరసన

- రాజకీయ పార్టీలకు అతీతంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించిన ప్రజలు






**అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 31 (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం ప్రధాన సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం నుంచి పంచాయతీ కార్యాలయం రోడ్డు వరకు ప్రజలు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తూ ఆదివాసి బిడ్డ శిరీషకు న్యాయం చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. హైదరాబాద్‌లో శిరీష హత్యకు నిరసనగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాజకీయ నాయకులు, ప్రముఖులు, ఆదివాసి ఆడబిడ్డలు, యువతతో పాటు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసన తెలిపారు. శిరీషకు జరిగిన అన్యాయం మరో ఆడబిడ్డకు జరగకూడదని, మహిళలకు పూర్తి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. మహిళలపై జరుగుతున్న దాడులు, హత్యలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. శిరీష కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కొవ్వొత్తులు వెలిగించి శిరీషకు నివాళులర్పించారు. శిరీషకు న్యాయం జరిగే వరకు ప్రజలంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

## ప్రజావాణిలో తొమ్మిది అర్జీలు



**ములకలపల్లి, ఆగస్టు 31 (ప్రజాజ్యోతి):** మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వివిధ సమస్యలపై 9 వినతి పత్రాలు స్వీకరించారు. వీటిలో రెవెన్యూకు 5, గృహ నిర్మాణ శాఖకు 3, ఐటీడీఏకు ఒక అర్జీ ఉన్నట్లు నోడల్ అధికారి, ఎంపీడీవో ఎస్ .వి. సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి బి. అరుణ్ బాబు, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ జి. సువర్చల, పశువైద్యాధికారి డాక్టర్ రామకృష్ణ, మండల విద్యాధికారి సత్యనారాయణ, మిషన్ భగీరథ ఏఈ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## శిరీష కుటుంబానికి న్యాయం చేయాలి

- హంతకుడిని బహిరంగంగా ఎన్ కౌంటర్ చేయాలి
- ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా నాయకురాలు ఇంటిక లక్ష్మి




**ములకలపల్లి, ఆగస్టు 31 (ప్రజాజ్యోతి):** ఆదివాసీ యువతి ఊకె శిరీష మృతి ఘటనకు కారణమైన నిందితులను బహిరంగంగా ఎన్ కౌంటర్ చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా నాయకురాలు ఇంటిక లక్ష్మి డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ మండలంలోని ముత్యాలంపాడులో సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటిక లక్ష్మి మాట్లాడుతూ.. కుటుంబ పోషణ కోసం హైదరాబాద్ కు వెళ్లి తుక్కుగూడలోని ఓ ప్రైవేట్ నర్సింగ్ హోంలో నర్సుగా పనిచేస్తూ కుటుంబానికి అండగా నిలిచిన శిరీష అనుమానాస్పదంగా మృతి చెందడం బాధాకరమన్నారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న సానద్ ఉల్లా ఖాన్ పై నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు. నేరం రుజువైతే నిందితుడిని కఠినంగా శిక్షించాలని, హంతకుడిని బహిరంగంగా ఎన్ కౌంటర్ చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ మహిళలు, యువతులపై దాడులు జరుగుతున్నా ప్రభుత్వాలు తగిన స్థాయిలో స్పందించకపోవడం బాధాకరమన్నారు. శిరీష కుటుంబానికి న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ ఘటనపై అన్ని సంఘాల నాయకులు స్పందించి బాధిత కుటుంబానికి అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మడకం లలిత, మడివి నాగలక్ష్మి, మడకం రామలక్ష్మి, సోడె మల్లేశ్వరి, ఈసం రుక్మిణి, మడివి రుక్మిణి, ఈసం వెంకటరమణ, పున్నమ్మ, భద్రమ్మ, నాగమణి పాల్గొన్నారు.

## గ్రామ స్థాయి నుండి పార్టీ బలోపేతమే లక్ష్యం



**ఇల్లందు, ఆగస్ట్ 31 (ప్రజా జ్యోతి)** గ్రామ స్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యమని, ఆ దిశగా ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు నిరంతరం కృషి చేయాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మండల రాము అన్నారు. సోమవారం ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదేశాల మేరకు మండలంలోని పోచారం తండా, బోయి తండా, మాణిక్యారం, ముత్తారపు కట్ట, రొంపేడు, మామిడి గుండాల, సిఎస్పి బస్తీ గ్రామపంచాయతీలలో విస్తృతంగా పర్యటించి నూతన గ్రామ కాంగ్రెస్ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజల ఆశీర్వాదాలతో కొలువుదీరిన ప్రజా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. ప్రజా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రజలకు చేరవేయడంపై నేతలు దృష్టి సారించాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి వివరించాలని కోరారు. ప్రతి గ్రామంలో కాంగ్రెస్ కార్యకర్తల పార్టీకి వెన్నుముకల నిలుస్తారని, కార్యకర్తల కష్టాన్ని, ప్రజలు నమ్మకాన్ని గౌరవిస్తూ పార్టీని మరింత ప్రతిష్టం చేసేందుకు నిరంతరం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, జిల్లా కాంగ్రెస్ కమిటి ప్రధాన కార్యదర్శి ఎట్టి హరికృష్ణ, జిల్లా కాంగ్రెస్ కమిటి సభ్యులు ఇస్లావత్ సతీష్, డిసిసిబి డైరెక్టర్ జనగం కొటేశ్వరరావు, ఇల్లందు ఎస్సి సెల్ మండల అధ్యక్షులు కాకటి భార్గవ్, నాయకులు మూతి కృష్ణ, పూనెం సురేందర్, పోచారం తండా సర్పంచ్ వాంకుడొత్ భారతి శ్రీను, చెన్నూరి శ్రీను, చెన్నూరి కృష్ణ, ఉపేందర్, పడిగ సంపత్, ధారవత్ తులిస్యా, పాయం కృష్ణప్రసాద్, మోకాళ్ళ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఉప ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే

- -ఎమ్మెల్యేను సన్మానించిన ఉప ముఖ్యమంత్రి



**ఇల్లందు, ఆగస్ట్ 31 (ప్రజా జ్యోతి)** తెలంగాణ రాష్ట్ర శాసనసభ అంచనాల కమిటీ చైర్మన్ గా నియమితులైన ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సోమవారం హైదరాబాద్ లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అంచనాల కమిటీ చైర్మన్, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్యను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం అంచనాల కమిటీ చైర్మన్ గా నియమితులై బాధ్యతలు స్వీకరించిన కోరం కనకయ్య కు అభినందనలు తెలిపారు.

## వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ జనరల్ కెప్టెన్ గా రాకూరి



**ఇల్లందు, ఆగస్ట్ 31 (ప్రజా జ్యోతి)** వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ జనరల్ కెప్టెన్ గా ఐఎన్టియుసి నేత రాకూరి బాబు రావు నియమితులయ్యారు. సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో సుమారుగా 4నెలలు పాటు నిర్వహించే స్పోర్ట్స్ అండ్ గేమ్స్ లో ఇల్లందు ఏరియా తరపున జనరల్ కెప్టెన్ గా రాకూరి బాబురావు వ్యవహరించనున్నారు. ఈ సందర్బంగా ఇల్లందు ఏరియా ఐఎన్టియుసి ఉపాధ్యక్షుడు జె వెంకటేశ్వర్లు, ఐఎన్టియుసి సెంట్రల్, స్థానిక నాయకులు శుభాకాంక్షలు తెలిపారు

## శిరీషకు ఘన నివాళి

- కొవ్వొత్తులతో భారీ ర్యాలీ.. కుటుంబానికి అండగా ఉంటా: ఎమ్మెల్యే జారే




**ములకలపల్లి ఆగస్టు 31 (ప్రజాజ్యోతి):** ఊకే శిరీష ఆత్మకు శాంతి చేకూరాలని, ఆమె కుటుంబానికి న్యాయం జరగాలని కోరుతూ సోమవారం ములకలపల్లిలో భారీ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఆదివాసీ జేఏసీ నాయకుల పిలుపు మేరకు అన్ని వర్గాల ప్రజలు, మహిళలు, యువత స్వచ్ఛందంగా ర్యాలీలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సైతం ర్యాలీలో పాల్గొని శిరీషకు ఘన నివాళులర్పించారు. సుందరయ్యనగర్ నుంచి కొవ్వొత్తులు చేతబూని పాత పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రధాన కూడలిలో శిరీష ఆత్మకు శాంతి చేకూరాలని కొద్దిసేపు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ.. శిరీష కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. శిరీషపై దాడికి పాల్పడిన నిందితులకు చట్ట ప్రకారం కఠిన శిక్ష పడేలా కృషి చేస్తానన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వ పరంగా అవసరమైన సహాయం అందేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సేన రాష్ట్ర సహాయ కార్యదర్శి, న్యాయవాది ఊకే రవి, సర్పంచులు కొరస చంద్రకళ, కుంజా వినోద్, తానం పద్మ, ఆదివాసీ నాయకులు కారం సుదీర్, మడకం చిరుమప్పు, గడ్డం ఉదయ్ కుమార్, మడకం శ్రీను, వట్టం శ్రీను, ప్రేమ్ కుమార్, సోడే శ్రీను, కొండ్రు భాస్కర్, తాటి ప్రవీణ్, కుంజా రాంబాబు, వాడే నరసింహారావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్, జిల్లా నాయకులు బత్తుల అంజి, మండల అధ్యక్షుడు ఎండీ జహీర్, పాలకుర్తి రవి, పాలకుర్తి సునీత్, కరుటూరి కృష్ణ, బాల అప్పారావు, కౌలూరి ప్రసాద్, అజీజ్ పాల్గొన్నారు..